ఎంపీ బీబీపాటిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి హరీశ్‌రావును కలిసిన లబానా లంబాడీ సంఘం స్టేట్ ప్రెసిడెంట్ తాన్‌సింగ్‌నాయక్, సంఘం ప్రతినిధులు

బీఆర్‌ఎస్‌కు జైకొట్టిన కాయితీ లంబాడీలు

- నామినేషన్ల నిర్ణయం ఉపసంహరణ
- హరీశ్‌తో ఆ సంఘం ప్రతినిధుల భేటీ
- గిరిజనులను అక్కున చేర్చుకున్నది సీఎం కేసీఆరే: మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): షెడ్యూల్ తెగల కోసం గతంలో ఎన్నడూలేని విధంగా అధిక మొత్తంలో నిధులు కేటాయించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేస్తున్న బీఆర్‌ఎస్ సర్కారుకే తమ పూర్తి మద్దతు ఉంటుందని లబానా (కాయితీ) లంబాడీ సమాజం స్పష్టంచేసింది. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌పై తమకు పూర్తి నమ్మకం ఉన్నదని, మూడోసారి బీఆర్‌ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చి, తమ సమస్యలు పరిష్కరించేది ఖాయమని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో నామినేషన్లు వేస్తున్నట్టు ప్రకటించిన నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకున్నట్టు ప్రకటించారు. ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఆర్థిక మంత్రి హరీశ్‌రావును లబానా లంబాడా ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా లబానా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర విషయాల గురించి మంత్రికి విన్నవించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. షెడ్యూల్ తెగల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. 4.6 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వినతుల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి హరీశ్‌రావుకు సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి హరీశ్‌రావును కలిసినవారిలో లబానా లంబాడీ సంఘం స్టేట్ ప్రెసిడెంట్ తాన్‌సింగ్‌నాయక్, అమర్‌సింగ్‌నాయక్, చందానాయక్, బిషన్‌లాల్, జగదీశ్, గంగారాం, దర్బార్, గోపాల్ తదితర నాయకులు ఉన్నారు.

సంగారెడ్డి జిల్లా అందోలులో మంగళవారం నియోజకవర్గ బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు.. సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

టికెట్లు అమ్మినోడు.. రాష్ట్రాన్ని అమ్మడా?

వంద కోట్లకు పటాన్‌చెరు టికెట్ విక్రయం • రేవంత్‌పై సొంత పార్టీ నేతల ఆగ్రహం: హరీశ్

- కాంగ్రెస్ అధిష్ఠానంపై దామోదర అలక
- హస్తం పార్టీతో జరభద్రం.. నమ్మితే రిస్కే
- అందోలులో క్రాంతికిరణ్‌ను గెలిపించాలి
- వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకుంటున్నారని, వారికి అధికారం అప్పగిస్తే రేపు తెలంగాణను సైతం అమ్ముకుంటారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే రిస్కు అని, తెలంగాణను అభివృద్ధి పథంలో నడుపుతున్న ఏకైక లీడర్ కేసీఆర్‌ను గెలిపిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు భద్రంగా ఉంటుందని చెప్పారు. సంగారెడ్డి జిల్లా అందోలులో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ బూత్‌స్థాయి ఇన్‌చార్జిల సమావేశంలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్, జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి, స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, బీఆర్‌ఎస్ నేతలు ఫారూఖ్ హుస్సేన్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఓ అతుకుల బొంత అని విమర్శించారు. సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు నేతలకు టికెట్ ఇప్పిస్తానని దామోదర రాజనర్సింహ మాట ఇచ్చి టికెట్ ఇప్పించలేదని, దీంతో పార్టీ అధిష్ఠానంపై అలిగారని పేర్కొన్నారు. పటాన్‌చెరు కాంగ్రెస్ టికెట్‌ను వంద కోట్లకు అమ్ముకున్నారని సొంత పార్టీ నేతలే ఆందోళనలు చేస్తున్నారని గుర్తుచేశారు. సొంత పార్టీ నేతల దిష్టిబొమ్మలు, ఫ్లెక్సీలు దహనం చేయడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్‌లోని మరికొందరు నేతలు తమకు వందకోట్లు రాలేదని బాధపడుతున్నారని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్యే టికెట్లు అమ్ముకుంటున్న కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే రాష్ట్రాన్ని ఆగం చేస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కాంగ్రెస్‌లో కుర్చీల కొట్లాట సాగుతుందని వెల్లడించారు. కాంగ్రెస్‌లోని 32 మంది నాయకులు సీఎం పదవి కోసం పోటీపడుతున్నట్టు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీలో ఒకరే లీడర్, ఒక్కరే సీఎం అదీ కేసీఆర్ అని తెలిపారు. తెలంగాణ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న కేసీఆర్ వైపు ప్రజలు నిలబడాలని, హ్యాట్రిక్ సీఎంగా గెలిపించాలని కోరారు.

పదిసీట్లు గెలుస్తాం..

క్రాంతిని భారీ మెజార్టీతో గెలిపించాలి

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించటమే తన లక్ష్యం అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు రాబోయే 23 రోజుల చిత్తశుద్ధితో పార్టీ గెలుపుకోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. 11 సార్లు కాంగ్రెస్‌కు ఓటు వస్తే కాంగ్రెస్ కనీసం కరెంటు ఇవ్వలేదు, నీళ్లు ఇవ్వలేదు, రోడ్లు వెయ్యలేదని విమర్శించారు. ఇప్పుడు ఓటు వేస్తే రాష్ట్రాన్ని రిస్క్‌లో పడేసి నట్టేనని హెచ్చరించారు. కర్ణాటకలో 5 గంటల కరెంటు ఇస్తున్నామని స్వయంగా ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఒప్పుకొన్నారని, రేపు ఆ పార్టీ వస్తే మన రాష్ట్రంలోనే అదే పరిస్థితి వస్తుందని చెప్పారు. సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం, జిల్లా అభివృద్ధి చెందిందని తెలిపారు. అందోలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటి క్రాంతికిరణ్‌ను కార్యకర్తలు, ఓటర్లు భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇతర పార్టీ నేతలను గెలిపిస్తే వారు హైదరాబాద్‌కే పరిమితం అవుతారని తెలిపారు. అందోలు నియోజకవర్గంలో కాంత్రికిరణ్‌ను గెలిపిస్తామని బీఆర్‌ఎస్ బూతుస్థాయి ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

మిలిగిన 9 మందికి బీఫారాలు

- అందజేసిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అలంపూర్ అభ్యర్థిగా విజేయుడు

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్‌ఎస్ అభ్యర్థులందరికీ బీ ఫారాలు అందించామని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు తెలిపారు. మొత్తం 119 నియోజకవర్గాలకు గాను ఇదివరకే 110 మందికి బీ ఫారాలు అందించగా మిగిలిన తొమ్మిది మందికి మంగళవారం అందజేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ వారికి బీఫారాలు అందించి అభినందించారు. అలంపూర్‌కు గతంలో ప్రకటించిన అబ్రహంకు బదులుగా విజేయుడికి బీ ఫారం అందించారు. గోషామహల్ అభ్యర్థిగా నంద కిషోర్ వ్యాస్, నాంపల్లి నుంచి అనంద్ కుమార్‌గౌడ్‌ను ప్రకటించారు. చాంద్రాయణగుట్టకు ఎం సీతారాంరెడ్డి, యాకత్‌పురా సామ సుందర్‌రెడ్డి, బహుదూర్‌పుర ఇనాయత్ అలీ బక్రి, మలక్‌పేట తీగల అజిత్‌రెడ్డి, కార్వాన్ అయిందాల కృష్ణ, చార్మినార్ సలావుద్దీన్ లోడిలకు బీఫారాలు అందజేశారు. మొత్తం నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడంతోపాటు వారికి బీఫారాలు అందించిన మొదటి పార్టీగా బీఆర్‌ఎస్ నిలిచింది.

స్ట్రాంగ్ రూముల్లో ఇతర ఈవీఎంలు ఉండొద్దు

- 20లోగా ఓటరు కార్డుల ముద్రణ పూర్తికావాలి
- కేంద్ర ప్రత్యేక పరిశీలకుడు అజయ్ వీ నాయక్ స్పష్టీకరణ

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముల్లో మరే ఇతర ఈవీఎంలను ఉంచవద్దని కేంద్ర ప్రత్యేక పరిశీలకుడు అజయ్ వీ నాయక్ రాష్ట్ర పోలింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఓటరు కార్డుల ముద్రణను ఈ నెల 20లోగా పూర్త చేయాలని స్పష్టం చేశారు. జిల్లాల్లోని ఎన్నికల అధికారులతో మంగళవారం రెండోరోజు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు సలహాలు ఇచ్చారు. ఎన్నికల విధులతో సంబంధంలేని వ్యక్తులు పోలింగ్ కేంద్రాల వద్ద తిరగడాన్ని అనుమతించకూడదని మరో కేంద్ర ప్రత్యేక పరిశీలకుడు దీపక్ మిశ్రా సూచించారు. షాడో రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని కేంద్ర (వ్యయ) ప్రత్యేక పరిశీలకుడు ఆర్ బాలకృష్ణన్ ఆదేశించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు కేవలం సాంకేతిక కారణాలతో అనుమతులను తిరస్కరించవద్దని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ సూచించారు. వీసీకి అదనపు సీఈవో లోకేశ్ కుమార్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్, డిప్యూటీ సీఈవో సత్యవాణి, డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్ర నోడల్ అధికారి (వ్యయం) మహేశ్ భగవత్, రాష్ట్ర పోలీసు నోడల్ అధికారి సంజయ్ కుమార్ జైన్ హాజరయ్యారు.



మంగళవారం జనగామలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి పొన్నాల, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి

మంగళవారం మెదక్‌లో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, మెదక్ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, చెల్ల సుధాకర్, జావిద్‌హుస్సేన్

మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి కావాలి

- తెలంగాణ ఆత్మను ఔపోసన పట్టిన వ్యక్తి
- నా దృష్టిలో కేసీఆర్ 'తెలంగాణ గాంధీ'
- పవన్‌కల్యాణ్ మాటలు నమ్మొద్దు
- ఏపీ ఫిలిం, టీవీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి

హైదరాబాద్/సిటీబ్యూరో, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఒక్కడే సరైన వ్యక్తి అని సినీనటుడు, ఏపీ ఫిలిం, టీవీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మను అవపోసన పట్టిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని, మానవతావాది అని, ఆయనను వదులుకోవద్దని, మరోసారి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోసాని మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'కేసీఆర్ మంచికి మంచి, చెడుకు చెడు ఉంటారు. భోళాశంకరుడు, వెరీ హానెస్ట్' అని ప్రశంసించారు. తెలంగాణకు కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని మొదటినుంచీ తాను కోరుకున్నానని చెప్పారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, జీవన విధానం ఇలా తెలంగాణ ఆత్మ మొత్తం అవపోసన పట్టిన వ్యక్తి సీఎం కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. బక్కపలుచగా ఉన్న కేసీఆర్ శరీరం సహకరించకపోయినా ఆమరణ దీక్షకు కూర్చున్నారు. అది ఆయన కమిట్మెంట్' అని పేర్కొన్నారు. నాడు కేసీఆర్‌కు ఏదైనా అయితే తెలంగాణలో ఒక్కో వ్యక్తి ఒక్కో అగ్నిగోళం అవుతాడని కాంగ్రెస్, బీజేపీకి భయం పట్టుకున్నదని, అందుకే తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చాయని చెప్పారు. అందుకే కేసీఆర్‌కు రాష్ట్రం తెచ్చిన ఘనత దక్కిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులంతా మేధావులని, అయితే దానికి నాయకత్వం వహించే సమర్థత కేసీఆర్‌కు మాత్రమే ఉన్నదని అన్నారు. అందుకే కేసీఆర్‌ను తాను 'తెలంగాణ గాంధీ'గా అభివర్ణిస్తానని వివరించారు.

పవన్‌కల్యాణ్.. ఇలాంటి వ్యాఖ్యలెందుకు?

'ఆంధ్రా కొడుకులు దోచేశారు అంటూ తెలంగాణ నుంచి తిట్టి, తన్ని తరిమేశారు' అని పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను పోసాని తీవ్రంగా తప్పుబట్టారు. తాను 1984 నుంచి తెలంగాణలో ఉంటున్నానని, ఏ ఒక్క తెలంగాణ బిడ్డ కూడా తననుగానీ, తన కుటుంబాన్ని గానీ బెదిరించలేదని చెప్పారు. తెలంగాణ బిడ్డలు తన్ని వెళ్లగొట్టిన ఒక్క కుటుంబాన్ని పవన్‌కల్యాణ్ చూపించినా తాను సీఎం కేసీఆర్‌ను నిలదీస్తానని సవాల్ చేశారు. 'మీ ఇంటిమీదగానీ, మీ అన్న ఇంటిమీదగానీ రాళ్లు వేశారా?' అని ప్రశ్నించారు. మహారాష్ట్రలో శివసేన కార్యకర్తలు ఇతర రాష్ట్రాల ప్రజలను వెంటబడి కొట్టిన సందర్భాన్ని గుర్తు చేశారు. అక్కడి లీడర్ తన సైనికులను ఆపలేకపోయారని, కానీ తెలంగాణ ఉద్యమ సమయంలో ఏ ఒక్క ఆంధ్రా వ్యక్తికి కూడా ఇలాంటి అవమానం జరగలేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఒక తండ్రి మాదిరిగా గొంతెత్తి మాత్రమే గట్టిగా మాట్లాడారని, కర్ర ఎత్తలేదని చెప్పారు. 'మా రాష్ట్రం మాకు ఇవ్వండి. మీరు కూడా ఉండండి, అందరినీ సమానంగా బిడ్డల్లాగా చూసుకుంటాం' అని కేసీఆర్ చెప్పారు. ఇప్పటికీ అదే చేస్తున్నారు. అందుకే నాకు కేసీఆర్ అంటే ఇష్టం అని వివరించారు. స్వార్థ రాజకీయాల కోసం, నాలుగు ఓట్ల కోసం రెండు రాష్ట్రాల మధ్య, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విబేధాలు సృష్టించవద్దని పవన్‌కు సూచించారు.

చంద్రబాబు కన్నా కేసీఆర్ తెలివి వందరెట్లు ఎక్కువ

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే చంద్రబాబుకు కండ్లు మండాయని పోసాని పేర్కొన్నారు. తనకన్నా చిన్నవాడు సీఎం కావడం ఓర్వలేక రూ.కోట్లు ఆశజూపి ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నించారని, రేవంత్‌రెడ్డిని బకరా చేశారని విమర్శించారు. కేసీఆర్‌కు చంద్రబాబు కన్నా వంద రెట్లు తెలివి ఎక్కువగా ఉన్నదని, ప్రభుత్వాన్ని కాపాడుకున్నారని చెప్పారు. ఆ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయొద్దని కొందరు కేసీఆర్ కాళ్లు పట్టుకుంటే వదిలేశారని, అందుకే చంద్రబాబు తెలంగాణను వదిలిపెట్టి పారిపోయి వచ్చాడని ఎద్దేవా చేశారు. అధికారం కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారుతారని, కేసీఆర్‌ను చంపితే తెలంగాణలో సీఎం అవుతానని భావిస్తే ఆ పని కూడా చేస్తారని ఆరోపించారు.

'3 గంటల'పై మాట మార్చిన రేవంత్

'24గంటల కరెంటు వద్దు, 3 గంటలో 5 గంటలు ఇస్తే సరిపోద్దని నేను అన్నట్టు కేసీఆర్ చెప్తున్నారు. ఎక్కడ అన్నానో చూపించాలి. 24 గంటల కరెంటు వద్దు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మూడే గంటలు కరెంటు ఇస్తామని ఎక్కడ అన్నామో చూపించాలి.'

- మంగళవారం అలంపూర్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

'తెలంగాణలో 95% మంది రైతులు మూడు ఎకరాలలోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులే. ఒక ఎకరా భూమికి నీళ్లు పారించాలంటే ఒక గంట కరెంటు సరిపోతుంది. పుల్లుగా మూడు ఎకరాలకు నీళ్లు పారించాలంటే మూడు గంటల కరెంటు సరిపోతుంది.'

-ఈ ఏడాది జూలై 10న అమెరికా తానా సభలో రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): రైతులకు 3 గంటల కరెంటు సరిపోతుందంటూ గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటమార్చారు. రాష్ట్రంలోని రైతులకు 3 గంటల విద్యుత్తు కావాలా? నిరంతర విద్యుత్తు కావాలా? అని ఎన్నికల సభల్లో సీఎం కేసీఆర్ రైతులను ప్రశ్నిస్తుండటం, రైతులు తమకు 24 గంటల కరెంటు కావాలని ముక్త కంఠంతో కోరుతుండటంతో రేవంత్‌రెడ్డి మాట మార్చారు. నిజానికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా 24 గంటల కరెంటు ఇస్తున్న దాఖలాలు లేవు. కర్ణాటకలో 5 గంటల కరెంటు ఇస్తున్నామని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మన రాష్ట్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పేర్కొనడం కాంగ్రెస్‌కు మైనస్‌గా మారింది. దీంతో డ్యామేజీ కంట్రోల్‌లో భాగంగానే రేవంత్‌రెడ్డి తాజా వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు. కరెంటు విషయంలో కాంగ్రెస్‌ను నమ్మేదిలేదని రైతులు చెప్తున్నారు.

ఐఏఎంసీకి భూమి కేటాయింపుపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ నిర్వహణలోని హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు భూమి కేటాయింపుతోపాటు ఏటా రూ.3 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు జీవోలు జారీచేయడంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయిదుర్గంలోని సర్వే నం. 83/1లో ఐఏఎంసీకి 3.70 ఎకరాలను కేటాయిస్తూ 2021 డిసెంబర్‌లో జీవో 128ను జారీచేసిన ప్రభుత్వం.. ఐఏఎంసీకి ఏటా రూ.3 కోట్ల ఆర్థిక సాయం అందజేసేందుకు 2022లో జీవో 78, 385లను జారీచేసిన విషయం తెలిసిందే. వాటిని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ కే సుజన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. దాదాపు రూ.300 కోట్ల విలువైన ఆ భూమిని ఐఏఎంసీకి కేటాయించడంతో పాటు నిర్వహణ ఖర్చుల కోసం ఏటా ఆ సంస్థకు రూ.3 కోట్లు ఇవ్వడం ప్రజా వ్యతిరేకమని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఐఏఎంసీకి సంబంధించిన నిర్మాణాలను నిలిపివేయడంతోపాటు ఇప్పటివరకు ఆ సంస్థకు చెల్లించిన మొత్తాన్ని వెనక్కి తీసుకునేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. దీంతో ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు న్యాయశాఖ కార్యదర్శికి, ఐఏఎంసీ సీఈవోకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం.. తదుపరి విచారణను డిసెంబర్ 21కి వాయిదా వేసింది.

బీజేపీ 'బీసీ సీఎం'ను ప్రజలు నమ్మరు

- నిన్నటిదాకా మతం.. ఇక కుల రాజకీయాలా?
- మోదీకి తల వంచం, తల దించం
- నిరుద్యోగ భృతి గురించి సీఎం కేసీఆర్ ఆలోచిస్తారు
- ఒంటరిగానే ప్రభుత్వం ఏర్పాటు
- దేశానికి కాంగ్రెస్ పార్టీ అరిష్టం, బీజేపీ పార్టీ దరిద్రం
- టీవీ చానల్ క్వశ్చన్ అవర్‌లో మంత్రి కే తారక రామారావు



బడ్జెట్ మేరకే మ్యానిఫెస్టో

రాష్ట్ర బడ్జెట్‌ను లెక్క వేసుకొనే మ్యానిఫెస్టోను రూపొందించామని కేటీఆర్ చెప్పారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని, అందుకు అనుగుణంగా సంక్షేమ పథకాల మొత్తాన్ని పెంచుకుంటూ పోతామని తెలిపారు. గతంలో బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని, ఇవ్వని హామీలు కూడా అమలు చేశామని చెప్పారు. 2009లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రెండు హామీలను కూడా అమలు చేయలేదని అన్నారు. ఆరు కిలోల బియ్యం, 9 గంటల కరెంటు ఇస్తామని చెప్పారని, వాటిని అమలు చేయలేదన్నారు.

హైదరాబాద్, నవంబర్ 7 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీజేపీ పాలనలో దేశమంతటా బీసీలకు మిగిలింది వేదన, అరణ్య రోదన అని మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. నిన్నటిదాకా మత రాజకీయాలు చేసిన బీజేపీ ఇప్పుడు కుల రాజకీయాలకు తెర తీసిందని మండిపడ్డారు. బీసీల జనగణన కూడా చేయని పాలన మోదీది అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో కనీసం బీసీ మంత్రిత్వశాఖను కూడా పెట్టలేదని ధ్వజమెత్తారు. బీజేపీ ముమ్మాటికీ బీసీల వ్యతిరేక పార్టీ అని వ్యాఖ్యానించారు. బీసీలంటే బీజేపీ దృష్టిలో బలహీనవర్గాలని, కానీ తమకు బీసీలంటే బలమైన వర్గాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీసీలకు పదవులే కాదు.. వారికి అనేక పథకాలిచ్చిన ప్రభుత్వం తమదని స్పష్టంచేశారు. 'బీసీ జనగణన చేయరు. బీసీ మంత్రిత్వశాఖ పెట్టరు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న బీసీని తీసేస్తారు. కానీ ఇవాళ బీసీ సీఎం అంటరు. ఇలాంటి నినాదాలు, ఆలోచనలను ప్రజలు నమ్మరు' అని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం ఒక్కసారి కూడా రుణ మాఫీ చేయలేదని, అలాంటి మోదీ.. రెండుసార్లు రుణమాఫీ చేసిన తమ సర్కారుపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. తనకు దేవుడిపై నమ్మకం ఉందని, అయితే దేవుడిని రాజకీయం కోసం వాడుకునే హిందువును కాదని చెప్పారు. మతం, హిందుత్వతో చిచ్చు పెట్టే విధానం తనది కాదని అన్నారు. ఇతర మతాలను కించపర్చనని, చర్చి, మసీదు అన్నింటికీ మొక్కుతానని తెలిపారు. ఓ టీవీ చానల్‌లో నిర్వహించిన క్వశ్చన్ అవర్‌లో కేటీఆర్ పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ప్రధాని మోకి తల వంచం, తల దించమని స్పష్టంచేశారు. మోదీది ఎవరినైనా లొంగదీసుకుంటామనే మనస్తత్వమని చెప్పారు. మోదీ భయపెట్టే ప్రయత్నం చేసినా బెదిరేదిలేదు, అదిరేది లేదని తేల్చి చెప్పారు. తెలంగాణలో బీజేపీ ఎత్తిపోయిందని అన్నారు.

ఒంటరిగానే ప్రభుత్వం

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయఢంకా మోగించి, ఆ తరువాత ఒంటరిగానే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. గతంలో రెండు పర్యాయాలు ఒంటరిగానే గెలిచామని, మళ్లీ ఒంటరిగానే గెలుస్తామని విశ్వాసం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ మూడో సారే కాదు.. ఆయన జీవిత కాలం ముఖ్యమంత్రిగా ఉంటారని స్పష్టంచేశారు. రాష్ట్రాన్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్ చేతిలో పెట్టాల్నా లేక కేసీఆర్ చేతిలో పెట్టాల్నా అన్నది ప్రజలు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. డబ్బులతో దొరికిన థర్డ్‌రేట్ క్రిమినల్‌కు పీసీసీ అధ్యక్షపదవిని అప్పగించడం తప్పుకాదా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ అందరినీ కలవడంలేదన్న ప్రశ్నకు.. కొందరు మేధావులు, పెద్దలకు మాత్రమే సీఎం కేసీఆర్ కలవరన్న ఆలోచనలున్నాయని, పైరవీకారులకు మాత్రమే ముఖ్యమంత్రులను కలవాల్సిన అవసరముంటుందని, అలాంటి వారిని కేసీఆర్ కలవరని చెప్పారు. కేసీఆర్ అహంకారి, నియంత అయితే రేవంత్‌రెడ్డి ఆయనను నోటికొచ్చినట్టు బూతులు తిట్టేవారా? ఈ రోజు బయట తిరిగేవారా?' అని ప్రశ్నించారు.

2024లో మహారాష్ట్రలో పోటీ

తెలంగాణ ఎన్నికల తరువాత మహారాష్ట్రలో పని మొదలుపెడుతామని కేటీఆర్ చెప్పారు. 2024లో మహారాష్ట్రలో ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ ఎన్నికల్లో బీజీగా ఉండటంతోనే ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పోటీ చేయడంలేదన్నారు. తెలంగాణ ఎన్నికల తరువాత మహారాష్ట్రలో ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో చేరుతారని అన్నారు.

లక్ష కోట్ల ఆస్తులు నిరూపించినోళ్లకే ఇచ్చేస్తా

తనకు లక్ష కోట్ల ఆస్తులున్నాయని నిరూపిస్తే.. వారికే ఆ ఆస్తులు ఇచ్చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. తమ ఆస్తుల వివరాలు ఎన్నికల అఫిడవిట్లలో ఉంటాయని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలోకి వచ్చేనాటికి తన నెల జీతమే రూ. 2.5 లక్షలని, స్వరాష్ట్రం కోసం దాన్ని వదులుకొని ఉద్యమంలోకి వచ్చానని వివరించారు.

• రేవంత్ లొడలొడ.. సభ వెలవెల

నారాయణపేట జిల్లా మక్తల్‌లో మంగళవారం కాంగ్రెస్ నిర్వహించిన సభ జనం లేక వెల వెల బోయింది. సభా ప్రాంగణం అంతా ఖాళీ కుర్చీలతో ఇలా దర్శనమిచ్చింది. -మక్తల్‌టౌన్

కేసీఆర్‌పై రేవంత్ అసభ్య పదజాలం

మొదటిపేజీ తరువాయి...

అన్నాడు. ఉద్యమ నేత, అభివృద్ధి ప్రదాతను పత్రికల్లో రాయడానికి వీల్లేని భాషలో దూషించాడు. కేసీఆర్ కుటుంబ సభ్యుల పేర్లు ప్రస్తావిస్తూ వాడిన పదప్రయోగం పట్ల రాజకీయ పరిశీలకులు, పాత్రికేయులు, విద్యావంతుల్లో తీవ్రమైన అభ్యంతరం వ్యక్తమవుతున్నది. మొన్నటికి మొన్న తనంతట తానుగా మర్యాదగా మాట్లాడుకుందాం.. అంటూ సుద్దులు చెప్పిన రేవంత్‌రెడ్డి రెండు రోజుల వ్యవధిలోనే నోటికొచ్చినట్టు కేసీఆర్‌ను తూలనాడటం గమనార్హం.

ఓటమి భయంతో పిచ్చిమాటలు

ఇటీవలి కాలంలో వెలువడుతున్న సర్వేలన్నీ బీఆర్‌ఎస్‌దే ఘనవిజయమని సూచిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ ఇప్పటిదాకా అభ్యర్థులనే ఖరారు చేసుకోలేకపోయింది. దీనికితోడు కాంగ్రెస్‌లో టికెట్ల రచ్చ కొనసాగుతున్నది. గాంధీభవన్ దగ్గర దిష్టిబొమ్మల దహనాలు.. తన్నులాటలు.. గుద్దులాటలు సాగుతున్నాయి. సీనియర్ లీడర్లు ఎవరి కుంపటి వారు పెట్టుకొని.. గ్రూపులుగా విడిపోయి ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. రేవంత్‌రెడ్డి టికెట్లు అమ్ముకున్నారని పార్టీ నాయకులు, కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఓటమి తప్పదని ఫ్రస్టేషన్‌లో రేవంత్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నాడు. ఇలాంటి మాటలవల్లే కార్యకర్తలు కూడా దారితప్పుతున్నారని, ఈ ప్రశాంత తెలంగాణలో హింసకు ఆగ్గిరాజేస్తున్నదని ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నారు. మొన్నటికి మొన్న దుబ్బాక ఎంపీ ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్త ఒకడు హత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. అప్పుడు కూడా రేవంత్‌రెడ్డి దీన్ని మసిపూసి మారేడుకాయ చేసేందుకు సోషల్‌మీడియాను వేదికగా చేసుకొని, కుటిల యత్నాలు చేశాడు. ఇటు విలేకరుల సాక్షిగా విపరీత వ్యాఖ్యలు చేశాడు. మొన్న అమెరికాలో రైతులకు 3 గంటల కరెంటు చాలని వీడియోల సాక్షిగా అన్న రేవంత్‌రెడ్డి.. అనంతరం ఆ మాటే అనలేదని బుకాయించే ప్రయత్నం చేశాడు. తాజాగా, తెలంగాణకు పితృసమానుడైన కేసీఆర్‌ను కించపరిచే వ్యాఖ్యలు చేశాడు. కాగా, రేవంత్‌రెడ్డి వైఖరి రాష్ట్ర రాజకీయాలను దిగజారుస్తున్నదని, విలువలకు పాతరేస్తున్నదని, ప్రమాణాలను పాతాళానికి తీసుకుపోతున్నదని రాజకీయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. చావునోట్లో తల పెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను నోటికొచ్చినట్టు మాట్లాడిన రేవంత్‌పై తెలంగాణ సమాజం మండిపడుతున్నది.